పాడి రైతులకు లంపి టెన్షన్!



- ముద్ద చర్మ వ్యాధి బారిన పడుతున్న పశువులు
- అగళి మండలంలోనే వందకు పైగా కేసులు
- మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పశువైద్యాధికారులు కరువు
- లబోదిబోమంటున్న పాడి రైతులు



కదిరేపల్లిలో ముద్ద చర్మ వ్యాధితో చనిపోయిన ఆవు

అగళి: మడకశిర నియోజకవర్గంలోని అగళి మండలంలో పశువులకు వ్యాపించే లంపి చర్మ వ్యాధి అంతకంతకూ పెరుగుతోంది. అత్యంత ప్రమాదకరమైన ఈ వ్యాధి సోకిన పశువులకు సరైన చికిత్స అందకపోతే పశువులు మృత్యువాత పడతాయి. ఇప్పటికే ఒక పశువు ముద్ద చర్మ వ్యాధితో చనిపోగా వందకు పైగా ఈ జబ్బు బారిన పడ్డాయి.

కరిదాసనపల్లిలో ఆవు మృతి

పశువులకు వచ్చే లంపి చర్మ వ్యాధి ప్రమాదకరమైంది. ఈ వ్యాధి సోకిన పశువులకు సరైన చికిత్స అందించకపోతే మృత్యువాత పడతాయి. అంతే కాకుండా వాటి ద్వారా ఇతర పశువులకు వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేస్తారు. వ్యాధి సోకిన పశువులకు ప్రత్యేకంగా ఉంచి చికిత్స అందిస్తారు. మండలంలోని కరిదాసనపల్లి గ్రామనికి రాజన్న చెందిన ఆవు లంపి చర్మ వ్యాధితో మృతి చెందింది. కదిరేపల్లి, గ్యారగోండనపల్లిలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతి గ్రామంలో పశువులు ఈ వ్యాధిన పడ్డాయి. దాదాపు వందకు పైగా పశువులు లంపి చర్మ వ్యాధిన పడటంతో పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటక వైద్యులే దిక్కు..

అగళి మండలంలో చాలా మంది రైతులు పాడి ఆవుల పైనే ఆధారపడి జీవిస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన సీమావులు రోగాల బారిన పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులు, పశువుల ఈనే పరిస్థితిలో పక్కనున్న కర్ణాటక రాష్ట్రం వెటర్నరీ డాక్టర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో 33,508 పశువులు

నియోజకవర్గంలోని అమరాపురం మండలంలో 6,380 ఆవులు, గుడిబండలో 4,497, మడకశిరలో 10,812, రొళ్లలో 6,101, అగళి మండలంలో 5,718 ఆవులు ఉన్నాయి. నియోజకవర్గంలో మూగజీవాలకు వైద్యం అందించడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైద్యులు కరువయ్యారు. పశుగ్రాసం దాణా పంపిణీ, ఎన్ఆర్ఈజీఎస్ కింద పశువుల కోసం తొట్టెలు, పశువుల, గొర్రెల, మేకల షెడ్ల నిర్మాణం తదితర ఎన్నో పథకాలు వైద్యుల ఆధ్వర్యంలోనే రైతులకు అందించాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారు స్పందించి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు పశువైద్యాధికారులను నియమించి పాడి రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లంపి చర్మ వ్యాధి లక్షణాలిలా..

- దోమలు, ఈగలు, గోమార్ల ద్వారా ముద్ద చర్మ వ్యాధి వ్యాపిస్తుంది.
- పశువులు నీరసంగా మారి జ్వరం 108 డిగ్రీల వరకూ ఉంటుంది.
- చర్మంపై కణతలు, దద్దుర్లు, పొక్కులు, కాళ్లల్లో వాపు కనిపిస్తాయి.
- ఆవుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. సూడి ఆవులు ఈడ్చుకుపోతాయి.
- పశువుల చర్మంపై మొదట మచ్చలు ఏర్పడుతాయి. మచ్చలు ఏర్పడిన చోట ఏడు రోజుల్లో చర్మం పగిలి పుండ్లు ఏర్పడతాయి.

అటకెక్కిన పశువైద్యం

మడకశిర నియోజకవర్గంలో మొత్తం 12 పశువైద్యశాలలు ఉన్నాయి. అగళి మండలంలో అగళిలో ఒకటి, మధుడి మరోటి ఉన్నాయి. అలాగే గుడిబండ మండలంలో గుడిబండ, రాళ్లపల్లి, ఎస్ రాయపురం, అమరాపురంలో అమరాపురం (ఏడీ పోస్టు), హేమావతి, బసవనపల్లి, రొళ్ల మండలంలో రొళ్ల, రత్నగిరి, మడకశిర మండలంలో మడకశిర (ఏడీ పోస్టు), గుండుమల, కల్లుమర్రి, నీలకంఠాపురం పశు వైద్యశాలలు ఉన్నాయి. అయితే నీలకంఠాపురంలో మాత్రమే ఒక పశువైద్యాధికారి ఉన్నారు. మిగతా చోట్ల వెటర్నరీ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం ఏహెచ్ఏ (యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్), గోపాలమిత్రలు మాత్రమే పనిచేస్తున్నారు. వారికి పెద్దగా జఠిలమైన సమ్యలపై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని పాడి రైతులు వాపోతున్నారు. అమరాపురం, మడకశిరలో రెండు ఏడీ స్థాయి పోస్టుల్లో మడకశిరలో మాత్రమే ఏడీ ఉన్నారు. అమరాపురంలో ఏడీ పోస్టు ఖాళీగా ఉంది. వెటర్నరీ డాక్టర్లతో పాటు ఏడీ పోస్టు ఖాళీగా ఉండటంతో నియోజకవర్గంలో పశు వైద్య అటకెక్కింది.

అప్పు చేసి మందులు కొన్నా..



మా ఆవులకు లంపి చర్మ వ్యాధి సోకింది. మందుల కోసం పశువైద్యశాలకు వెళ్లాను. అయితే పశువైద్యశాలకు మందులు సరఫరా కాలేదని, అక్కడి సిబ్బంది బయట మందులు కొనుక్కోమని మందుల చీటీ రాసిస్తున్నారు. ఆ మందుల ధరలు ఎక్కువ రేట్లు ఉండటంతో అప్పులు చేసి పశువులకు వైద్యం చేయించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే మందులను సక్రమంగా సరఫరా చేసి పశువైద్యాధికారిని నియమించాలని కోరుతున్నాం.

– రైతు నింగప్ప, కదిరేపల్లి గ్రామం, అగళి మండలం

లంపి స్కిన్ వ్యాధితో జాగ్రత్త..



పశువులకు లంపి స్కిన్ వైరస్ సోకుతున్న మాట నిజమే. పాడి రైతులు అప్రమత్తంగా ఉండి పశువులను రక్షించుకోవాలి. రైతులు కర్ణాటక నుంచి పశువులను తీసుకొని రావడం వలన ఆ పశువులకు వ్యాధి సోకి ఉండొచ్చు. ఇక్కడ వ్యాక్సినేషన్ మందుగానే వేసినా కూడా అలాంటి ఆవులకు కూడా వ్యాధి వ్యాపిస్తోంది. వ్యాధి రాకుండా పశువులకు ముందుగా వ్యాక్సినేషన్ చేశాము. అయితే వ్యాధిన బారిన పశువులకు యాంటీబయాటిక్ మందు అందుబాటులో లేకపోవడంతో రైతులు బయట కొనుగోలు చేసి మందులు వేసుకుంటున్నారు.

– అమర్, ఏడీ, పశువైద్యశాఖ, మడకశిర

క్లుప్తంగా

'దేశ్ కా ప్రకృతి పరీక్షన్'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అనురాధ

హిందూపురం టౌన్: మండలంలోని సంతేబిదనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో దేశ్ కా ప్రకృతి పరీక్షన్ యాప్‌పై అవగాహన సదస్సు, మెడికల్ క్యాంపును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఏ విధమైన ఆహారం, వ్యాయామాలు అవసరమో వివరించారు. అలాగే జీవనశైలి మార్పు జరిగినప్పుడు మాత్రమే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని సూచించారు.

'తల్లికి వందనం' అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

హిందూపురం టౌన్: అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని శ్రీకంఠపురంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో నెలకొన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలన్నారు.

బాలుడి హత్య బాధాకరం

మడకశిర: మండలంలో 8వ తరగతి చదువుతున్న బాలుడు చేతన్ హత్యకు గురికావడం బాధాకరమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మట్లాడుతూ చేతన్ హత్యను ఖండిస్తున్నామన్నారు. హంతకులను పోలీసులు కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో ఎంజేపీ విద్యార్థిని మృతి



తన్విక (ఫైల్)

చిలమత్తూరు: మండల పరిధిలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిభా పూలే బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తన్విక (15) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ విద్యార్థిని స్వగ్రామం మోతుకపల్లిలో మృతి చెందినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. మృతురాలికి తల్లిదండ్రులు లేరని, అవ్వాతాతల సంరక్షణలో పెరిగిందన్నారు. ఉత్తమ విద్యార్థినిగా పేరు సంపాదించుకున్న తన్విక అకాల మరణం తమను కలచివేసిందని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు ఆవేదన వెలిబుచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



నూర్ అహ్మద్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

హిందూపురం: పట్టణంలోని 3వ వార్డు శాంతినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ముస్లిం మతపెద్ద నూర్ అహ్మద్ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, నాయకులు తరలివెళ్లి ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మహేష్‌గౌడ్, దాదాపీర్, ఆసిఫ్‌వుల్లా, శ్రీరామరెడ్డి, రామచంద్ర, మన్సూర్, రహమాతుల్లా, అయూబ్, ఫరూక్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



రెండోస్థానంలో నిలిచిన కోవెల

గుడిబండ: మండల పరిధిలోని బూదిపల్లి తండాకు చెందిన సత్యప్రకాష్, అమృత దంపతుల కుమార్తె ఎస్ కోవెల రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీల్లో సత్తా చాటింది. అమరాపురం మండలం హలుకూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కోవెల ఏలూరు జిల్లా పెడవేగిలో జరిగిన రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. దీంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు చెక్



అమరాపురం: సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రత్న

అమరాపురం/గుడిబండ: అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేలా పనిచేయాలని ఎస్పీ వి.రత్న పోలీసు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆమె అమరాపురం, గుడిబండ మండల కేంద్రాల్లోని పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ... అమరాపురం, గుడిబండ మండలాలు కర్ణాటక రాష్ట్రానికి ఆనుకుని ఉండటంతో అసాంఘిక కార్యాకలాపాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే పిటిషనర్లతో మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. మండలాల్లోని పరిస్థితులను సీఐ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు, సాంఘిక దురాచారాలకు అడ్డుకట్ట వేసేందుకు కృషిచేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం అమరాపురం స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న పాత పోలీస్ స్టేషన్ స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఈ స్థలం పోలీస్‌శాఖకు చెందినదని, ఇక్కడ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే పోలీస్‌శాఖకు మంచి ఆదాయం వస్తుందని స్థానికులు తెలుపగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లిలో వెలసిన లక్ష్మీదేవి, శనీశ్వరస్వామివార్లకు శుక్రవారం భక్తులు ఘనంగా కుంభాభిషేకం, హారతులను నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీని వార్డు, గ్రామస్థాయిలో మరింత బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సూచించారు. శుక్రవారం గీతానగర్, ఈదుళబలాపురం గ్రామంలో కమిటీల ఎంపిక చేశారు. గీతానగర్ వార్డు అధ్యక్షుడిగా గూడూరు రమేష్, ఉపాధ్యక్షుడిగా బండారు శివప్రసాద్, బీసీ సెల్‌కు సాయిరాం, మైనార్టీ సెల్‌కు కుళ్లాయప్ప, యువజన విభాగానికి మురళి, చేనేత విభాగానికి రఘునాథ్‌రెడ్డి, విద్యార్థి విభాగానికి శ్రీనిధిలను ఎంపిక చేశారు. అలాగే ఈదుళబలాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా రవీంద్రరెడ్డి, బీసీ సెల్‌కు విజయ్‌కుమార్, ఎస్సీ సెల్‌కు నాగేంద్రబాబు, రైతు విభాగానికి హనుమంతురెడ్డి, యువజన విభాగానికి ఆదినారాయణరెడ్డి, విద్యార్థి విభాగానికి నరేష్, మహిళా విభాగానికి సరోజమ్మ, సోషల్ మీడియాకు నరేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

చిక్కీలు తిని విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళి కోణనకుర్కె ప్రభుత్వ పాఠశాలకు చెందిన 46 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తర్వాత చిక్కీలు తిని అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు విరేచనాలతో ఇబ్బందులు పడటంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యమందించారు. విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చెందారు. స్థానిక తహసీల్దార్ వరదరాజు, ఆర్ఐ రాజగోపాల్ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యుడు బాబు నేతృత్వంలో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించారు. చిక్కీల్లో పురుగులు ఉండటంతో తాము ఇబ్బంది పడినట్లు విద్యార్థులు తెలిపారు. సగం చిక్కి తిన్న తర్వాత పురుగులు కన్పించాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిక్కిలను పరిశీలించడానికి తనిఖీ బృందాన్ని నియమిస్తున్నట్లు బీఈఓ ఇంద్రాణమ్మ పేర్కొన్నారు.

గంగమ్మకు నివాళి

పెనుకొండ: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాతృమూర్తి గంగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్ తదితరులు శుక్రవారం తిమ్మాపురం చేరుకొని గంగమ్మ భౌతికకాయం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

లేపాక్షి హుండీ ఆదాయం రూ.7.71 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

చిలమత్తూరు (లేపాక్షి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గా వీరభద్రస్వామి ఆలయ హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ మేరకు హుండీ ద్వారా రూ.7,71,527 ఆదాయం వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా హుండీ ఆదాయం పెరిగినట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నరసింహసింగ్, ఆలయ పాలక మండలి చైర్మన్ కరణం రమానందన్, సర్పంచ్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ



కొండంపల్లిలో ఓఆర్‌హెచ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: ఓహెచ్ఆర్ తాగునీటి ట్యాంకు నిర్మాణానికి మంత్రి సవిత భూమి పూజ చేశారు. మండలంలోని రాంపురం పంచాయతీ కొండంపల్లి గ్రామంలో శుక్రవారం రూ.30 లక్షలతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.72 కోట్లతో 147 ఓఆర్‌హెచ్ ట్యాంకర్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనుకొండ: బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేతజౌళి శాఖామంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆరుగురికి రూ.6,87,744 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బాధితులు తాము పొందిన డబ్బును వైద్య ఖర్చులకు, కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

21 మందికి ఉద్యోగాలు

మడకశిర: జాబ్‌మేళాలతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయని స్థానిక ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. 34 మంది నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. 21 మంది నిరుద్యోగులను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాయొద్దు

పావగడ: చిన్నారుల హక్కులను కాల రాయకుండా కాపాడాలని, చిన్నారులకు సరైన విద్య అందించాలని తాలూకాలోని చిక్కహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మీనాక్షి అంజయ్య, పీడీఓ అక్కులప్ప తెలిపారు. శుక్రవారం ఆ పాఠశాలలో నిర్వహించిన గ్రామసభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలనపై తల్లిదండ్రులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా, తాలూకా పంచాయతీల ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మిక పద్ధతి నివారణపై ప్రదర్శించిన నాటకం అందరినీ ఆకట్టుకుంది.

క్రీడల్లో ఉన్నతస్థాయికి చేరుకోవాలి



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

హిందూపురం: క్రీడల్లో రాణించి ఉత్తమ క్రీడాకారులు మరింత ఉన్నతస్థాయి చేరుకోవాలని ముదిరెడ్డిపల్లి జెడ్పీపాఠశాల హెచ్ఎం సుధామణి అన్నారు. ఇటీవల క్రీడాల్లో రాణించిన విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన గోకుల్ చరణ్‌నాయక్, గ్రాఫ్లింగ్(కుస్తీ) జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న శ్రీచరణ్, రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచిన శోభన్‌ను హెచ్ఎంతో పాటు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ సురేష్ కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రకాష్ అభినందించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ మీట్

మడకశిర: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ మీట్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

గోపుర కలశం వితరణ

పరిగి: మండలంలోని కాలువపల్లిలో

సంక్షిప్త సమాచారం

అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన నవగ్రహాల ఆలయానికి గోపుర కలశాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు బంగారు చంద్ర అందించారు.

రేపు ఉచిత ధ్యాన శిక్షణ

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కన్యకాపరమేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

పరిగి: మండల కేంద్రంలోని పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజు అధ్యక్షతన స్థానిక ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో డాక్టర్ యాస్మిన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో నిత్యం అనుసరించాల్సిన పరిశుభ్రతా కార్యక్రమాలను తెలియజేశారు. వ్యాసరచన పోటీలను నిర్వహించి ప్రతిభావంతులకు బహుమతులను అందజేశారు.

బీమా యోజనపై అవగాహన

చిలమత్తూరు: ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనపై మండల పరిధిలోని వీరాపురంలో కెనరా బ్యాంక్ చిలమత్తూరు బ్రాంచ్ మేనేజర్ షేక్ షాజిద్ అవగాహన కల్పించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ పలు సూచనలు చేశారు.

ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తాం

అమరాపురం: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సచివాలయం సిబ్బందితో వసతి గృహన్ని సందర్శించారు. ఆయన వెంట ఏఓ.విశ్వేశ్వరరాధ్య టీఏ హనుమంతరాయ, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, మెట్రిన్ మాధవి ఉన్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయండి

రొళ్ల: అపార్ నమోదును వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయం ఆవరణలో ప్రత్యేకంగా నమోదు చేస్తున్న అపార్ ప్రక్రియను పరిశీలించారు. రొళ్ల ఉన్నత పాఠశాలలో నూతనంగా ప్రారంభమైన జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ నమోదు విషయంలో నిర్ధారించిన రుసుము మాత్రమే విద్యార్థుల నుంచి వసూలు చేయాలన్నారు. రెండు రోజుల్లోగా వందశాతం అపార్ పూర్తి చేయాలన్నారు.

అగళిలో పర్యటించిన ఎమ్మెల్యే

అగళి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆదర్శ పాఠశాలను ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు సందర్శించారు. గ్రామాల్లో రేషన్ డీలర్లకు స్టాక్ పాయింట్ నుంచి రేషన్ తక్కువగా వస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే కసాపురం ,రామనపల్లిలో నూతనంగా వేసిన సీసీ రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బరావు, రేషన్ డీలర్లు, జెడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజశేఖర్

హిందూపురం టౌన్: విద్యార్థులు, యువత సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని వక్తలు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'సామాజిక మాధ్యమాల దుర్వినియోగం-యువతపై సైబర్ నేరాల ప్రభావం' అనే అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ ఎం ప్రగతి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజశేఖర్, అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ శ్రీనివాసరెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ జీ.ఆర్.సిద్దు, అదనపు గవర్నమెంట్ ప్లీడర్ సుదర్శన్, న్యాయవాదులు సంతోషిని, కళావతిలు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు యశోదా దేవి, హేమా మారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మీడియా కోఆర్డినేటర్‌గా ప్రణయ్‌రెడ్డి



హిందూపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్‌గా సడ్లపల్లి ప్రణయ్‌రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ సమన్వయకర్త టీఎన్. దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడేళ్లుగా వైఎస్సార్‌సీపీలో మీడియా కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్న ప్రణయ్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.